# నేను కాదు బాబోయ్...

-ఎం.కె.వి. సీతారామ్

ఒడిసి ఒడిసి కొడుతున్న ఈదురుగాలి!

ఈదురుగాలికి జడిసి కసిగా కురుస్తున్న వానతుంపరలు!!

చలి... ఎముకలు కొరికే పాడు చలి!!!

అద్దాలన్నీ బిగించినా, అప్పటి గంటన్నర ముందు వెచ్చగా దిగిన 'మందు'ని కూడా ఖాతరు చేయకుండా చలిని తన గుండెలో ఇముడ్చుకుంటూ ఒకటే హోరుతో ముందుకు పరుగెడుతోంది మారుతీకారు.

స్టీరియోలో జాష్పన్ సంగీతం హోరు. కారు శబ్దంలో కలిసినా అస్పష్టంగానే వినపడుతోంది. చేతిలో వున్న స్టీరింగు ఆనవాలుగా తిరుగుతున్నట్టు తిరుగుతోంది.

హెడ్ లైట్ల వెలుతురులో తుంపరలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దూరం నుంచి... ఎవరో.. మసగ్గా...

రోడ్డు దాటుతున్నట్టుంది. గ్లాసుల్లోంచి సరిగ్గా కనబడడంలేదు!

చేతులు తడారిపోయాయి.

కాళ్ళు పనిచేయడంలేదు.

'మందు' తాత్కాలికంగా కిక్కు ఇవ్వడంలేదు.

బ్రేకుపై పడిన కాళ్ళు, కీచుమంటూ ఆగిపోయింది కారు.

గందరగోళం పరిస్థితి ఏర్పడింది.

"గురుడు చాలా మందు మీదు న్నట్టుంది గురువా, పోనీలే కుర్రాడికి దెబ్బలేమీ తగలలేదు" అన్నాడొకడు.

"ఆడు నిజంగా అదృష్టవంతుడే. పడితే పడ్డాడు, డాక్టరు కారుకిందే పడ్డాడు" అన్నాడు మరొకడు.

ఉలిక్కిపడ్డాను- నేను డాక్టర్నా...

"వైద్యం చేయమనండి, అలా గుడ్ల ప్పగించి చూస్తాడేం?"

"ఆడు డాక్టరా? మనిషి ప్రాణా లతో చెలగాటమాడుతున్నట్టుంది, ఉత కండ్రా..."

"ఏ నర్సుతోనే ఇంతవరకు ఓ గేమ్ ఆడుంటాడు. హుషారెక్కువైన ట్టుంది."

తలొక మాట అంటూనే వున్నారు. నాకేం అర్థం కాలేదు. నాకు పిచ్చె క్కిస్తున్నారు. 'నేను డాక్టర్నా, నేను డాక్టర్ననడానికి వీళ్ళకి రుజువేది? ఒక వేళ నాలాటివాడు ఈ చుట్టుపక్కల వున్నాడేమో. వాడు డాక్టరేమో. అయితే అయివుండవచ్చు' అనుకున్నాను మన సులో.

ఇంతలో..

"ఇలాంటోళ్ళను పోలీసులకు అప్ప జెప్తే సరి.."

ఇంకా చిన్న చిన్న తుంపర్లు పడు తూనే వున్నాయి.

అలా ఆలా ఓ పలభైమంది వరకు గుమిగూడారు.

"నాకు తెలీక అడుగుతాను. నేను డాక్టర్నని మీరెలా అనుకుంటున్నారు?



నేను డాక్టర్ని కాను" అన్నాను భయం గానే నోరు విప్పి నెమ్మదిగా.

"అదేంటి బాబు, నిజంగానే నేను డాక్టర్ని కాను" అన్నాను కొద్దిగా కోపం తెచ్చుకుంటూ.

మళ్ళీ గందరగోళం మొదలయింది. ఒక్కొక్కరు ఒక్కో విధంగా అరుస్తు న్నారు.

"ఒరేయ్, ఈడి తెలివి చూడండ్రా,

"బహుశా వీడికి పిచ్చిపట్టయినా వుండాలి! లేకపోతే పిచ్చాసుపత్రి నుంచి తప్పించుకోనయినా వుండాలి. ఉరకండ్రా! డాక్టరు కాడట. జోకేస్తు న్నాడు."

కారుమిద ఇంత ఎద్ద డాక్టర్ ఏంబ్లమ్ సింబల్ పెట్టుకుని, ఇంకా నేను డాక్టర్నా అని అడుగుతున్నాడు. ఈడి తెలివి...."

లైటు వెలిగింది. ఓహో ఈ సింబల్ ఏంబ్లమ్‌ని చూసి వీళ్లు నన్ను డాక్టర్నను కుంటున్నారు. వినుగొచ్చింది. దాంతో పాటే నవ్వొచ్చింది.

"బాబూ నేను చెప్పేది కాస్త వింటారా..."

"ఆగండ్రా. ఆయన చూస్తే పెద్దమ నిషిలాగున్నాడు. ఆయన చెప్పిందేదో.."

"ఈడన్నింటికీ అంతే..." ఒకరిద్దర న్నారు.

"బాబ్బాబు, నేను చెప్పేది వినండి. నేను డాక్టర్ని కాను. ఈ కారు నాదే. కాని మా ఆవిడ డాక్టరు. ఆవిడ్ని హాస్పిటల్‌లో దింపేసి వర్షం కదా ఓ పెగ్ వేసుకున్నాను. రండి, కావాలంటే చూపిస్తాను. హాస్పటల్‌కి తీసుకెళ్ళి మా ఆవిడ చేత వైద్యం చేయిస్తాను" గురి చూసి ఓ అస్త్రం వదిలాను.

"నిజమేనా బాబూ..."

"ఆదంతా వట్టిదే.. ఈడు డాక్టరే!"

"నిజం బాబూ, నేను కాదు. మా ఆవిడ. కావాలంటే రండి, నేను తీసుకెళతాను"

"నిజమేనేమో..."

"సరే ఎక్కండ్రా, ఆ హాస్పటల్‌కి పోదాం."

"ఫర్వాలేదులే. ఆడికేం పెద్ద దెబ్బలు తగలలేదుగా, ఓ రెండొందలు పడెయ్య మనండి" అన్నాడు మరొకడు.

"అవును, అంతే పాపం మళ్ళీ వెనుకకు ఏం వెళ్తాడు. ఆ రెండొం దలూ ఇచ్చేస్తే వాడే చూసుకుంటాడు" అన్నాడు మరొకడు.

జేబులోనుంచి రెండొందలు తీసి అతనికిచ్చాను.

ఎవరి మటుకు వాళ్ళెళ్ళిపోయారు.

అయితే...

నిజానికి నేను డాక్టర్ని కాను. మా ఆవిడ డాక్టరు అంతకంటే కాదు. అసలు నాకింకా పెళ్ళే కాలేదు. ఈ కారు దొంగిలించిన అంతర్జాతీయ క్రిమినల్ని. ఈ కారులో డిక్కీనిండా మరో రెండు రోజుల్లో విశాఖపట్నంలో కొన్నిచోట్ల పేలబోయే మందుగుండు సామగ్రి వుందన్న సంగతి పాపం వాళ్ళకేం తెలుసు?